# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | HYDERABAD




## బొద్దింకలు..కుళ్లిన కూరగాయలు

సిటీబ్యూరో: నారాయణగూడలోని ఇండియన్ దర్బార్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటగదిలో అపరిశుభ్రమైన వాతావరణం, బొద్దింకల బెడద ఉన్నట్లు గుర్తించారు. కుళ్లిన టామోట, పచ్చిమిర్చి, క్యారెట్లు, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు తేల్చారు. మసాలా పౌడర్ , జీలకర్ర పొడి ఇతర వస్తువులు గడువు ముగిసినట్లు గుర్తించి, వాటిని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకలో వంటగది గోడలు అపరిశుభ్రంగా ఉండడం, దుర్వాసన వస్తుండడాన్ని గమనించారు. బొద్దింకల తాకిడి, ఫ్రిజ్‌లో ఉన్న పాత్రలు తుప్పు పట్టినట్లు గుర్తించారు. సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడినట్లు తేల్చారు. కుళ్లిపోయిన బెండకాయలు, క్యాలీఫ్లవర్‌ను గుర్తించి వాటిని పారబోశారు. గడువు ముగిసిన వస్తువులు, కర్రీ కట్ చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



కొంపల్లిలో మంగళ వారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోదరి చీటీ సకలమ్మ దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




కంటోన్మెంట్ అన్నానగర్‌లోని ఇందిరమ్మనగర్‌లో ఆరు నెలల కిందట రోడ్లను తవ్వి డ్రైనేజీ పైపులైన్లు వేశారు. ఆ తర్వాత రోడ్డు వేయకపోవడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు.

# సర్కారు కండ్లు తెరవట్లే

### అన్ని రంగాలు నష్టపోతున్నా.. పట్టించుకోని ప్రభుత్వం

### గ్రామాల్లో జఠిలంగా సమస్యలు..ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 4: వివిధ రంగాలకు చెందిన వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన నూతన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి.. మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోతున్నా.. ప్రభుత్వం కండ్లు తెరవకపోవడం బాధాకరమని ఆవేదన చెందారు. రాష్ట్రంలో రైతులు, బిల్డర్స్, ఆటో డ్రైవర్లు అనేక రంగాల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని, సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు జఠిలంగా మారాయన్నారు. కనీసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలైనా త్వరగా నిర్వహించాలన్నారు. పాలన వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, మాజీ ప్రజా ప్రతినిధులు దుర్గ, లావణ్య, పద్మ, భూపాల్‌రెడ్డి, బీరప్ప బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్రనగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# అంధకారంలో భాగ్యనగరం

### పలు ప్రాంతాల్లో వెలగని వీధి లైట్లు
### గ్రేటర్‌లో జఠిలంగా స్ట్రీట్ లైట్ల నిర్వహణ
### -మరమ్మతులు, కొత్త దీపాల బిగింపులో తీవ్ర జాప్యం
### -రోజుకు వందల సంఖ్యలో ఫిర్యాదులు
### పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు 10వేలకుపైగానే..

సిటీబ్యూరో : గ్రేటర్‌లో వీధి లైట్ల నిర్వహణ జీహెచ్‌ఎంసీకి సవాల్‌గా మారింది. ఉన్నతాధికారుల బాధ్యతరాహిత్యం, ఏజెన్సీ నిర్లక్ష్యం వెరసి గ్రేటర్‌లోని పలు ప్రాంతాలు, రహదారుల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. 5.48 లక్షల వీధి దీపాల్లో దాదాపు 20 శాతానికి పైగా వెలగడం లేదు. ఈ నేపథ్యంలోనే వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా లేదని, మరమ్మతులు జరపాలంటూ రోజుకు వందల సంఖ్యలో ఫిర్యాదులొస్తున్నాయి. ఇటీవల కౌన్సిల్ సందర్భంగా వివిధ పార్టీల కార్పొరేటర్లు సైతం వీధి దీపాల లోపాలను తూర్పారపట్టారు. కమిషనర్ సైతం సమస్య ఏజెన్సీతో వచ్చిందని, దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించామని, జోన్ల వారీగా కొత్త వీధి లైట్లను అమర్చుతున్నట్లు ప్రకటించారు. అయితే కౌన్సిల్ జరిగి ఐదు రోజులు గడిచినా.. క్షేత్రస్థాయిలో వీధి దీపాల నిర్వహణ, కొత్త వీధి లైట్ల బిగింపు ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేదు. ఏజెన్సీ మాత్రం తమకు బల్దియా నుంచి రూ. 100 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని, వాటిని చెల్లిస్తేనే మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందని చెబుతూ వస్తుండడంతో సమస్య జఠిలంగా మారింది.

#### సుమారు 5.48 లక్షలకు పైగా..

గ్రేటర్‌లో సుమారు 5.48 లక్షలకు పైగా వీధి దీపాలను నిర్వహించే బాధ్యతలను 2018 ఏప్రిల్ నుంచి ఏడేండ్ల పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిలో 10 శాతం స్ట్రీట్ లైట్లు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా వెలగడం, ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుండగా, మిగిలిన వాటన్నింటినీ మ్యానువల్‌గానే నిర్వహిస్తున్నారు. అయితే నిర్వహణలో ఈఈఎస్ఎల్‌పై తరచూ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఒకానొక దశలో గత కమిషనర్లు సైతం మందలించారు. ముఖ్యంగా వీధి దీపాల మరమ్మతుల పాలైనప్పుడు మార్చాల్సిన లైటు, ఇతర పరికరాలను ఎప్పటికీ సుమారు 15 శాతం రిజర్వ్ పెట్టుకోవాలన్న నిబంధన ఒప్పందంలో ఉన్నప్పటికీ దానిని ఈఈఎస్ఎల్ ఏ మాత్రం అమలు చేయడం లేదు. ఇటీవల కాలంలో తరచూ స్ట్రీట్ లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామంటూ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. వాస్తవంగా గ్రేటర్‌లో వీధి లైట్లు రోజూ 98శాతం వెలగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 80 శాతం లోపే వెలుగుతున్నట్లు ఫిర్యాదుల ఆధారంగా కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అందుబాటులో నిత్యం 27,500 (5శాతం) ఉండాలి. కానీ కేవలం మూడు వేలు మాత్రమే ఉండడం గమనార్హం. కొత్త వీధి లైట్ల బిగింపులో భాగంగా సీసీఎంఎస్ టెక్నాలజీతో 15,500 కొత్త ఎల్ఈడీలను అమర్చుతున్నట్లు అధికారులు చెప్పారు. ఎల్బీనగర్ జోన్‌లో 722, చార్మినార్‌లో 759, ఖైరతాబాద్‌లో 1031, శేరిలింగంపల్లిలో 454, కూకట్‌పల్లిలో 1585, సికింద్రాబాద్‌లో 606లు కలిపి మొత్తం 5157 చోట్ల వీధి లైట్లను అమర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

**వీధి లైట్ల నిర్వహణపై జోన్ల వారీగా వచ్చిన ఫిర్యాదులు**

| జోన్ | ఫిర్యాదుల స్వీకరణ | పురోగతిలో ఉన్నవి | మొత్తం |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 540 | 86 | 626 |
| చార్మినార్ | 2185 | - | 2185 |
| ఖైరతాబాద్ | 2622 | 197 | 2819 |
| శేరిలింగంపల్లి | 608 | 11 | 619 |
| కూకట్‌పల్లి | 846 | 69 | 105 |
| సికింద్రాబాద్ | 3205 | 2 | 3207 |



పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ..మంగళ వారం నిరసన తెలుపుతున్న కింగ్‌కోఠి శానిటేషన్ పేషెంట్స్ కేర్ సెక్యూరిటీ సిబ్బంది

## గ్రేటర్ @ 34.2డిగ్రీలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి మించి నమోదవుతుండడంతో గ్రేటర్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.2 డిగ్రీలు, కనిష్ఠం 17.4 డిగ్రీలు, గాలిలో తేమ 37 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## నేడు స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్


### 10 నుంచి 17వరకు నామినేషన్ల స్వీకరణ
### 18న పరిశీలన, 21న ఉపసంహరణ, 25న ఎన్నికలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్‌ఎంసీ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నేడు నోటిఫికేషన్ జారీ కానున్నది. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఈ మేరకు మంగళవారం బల్దియా షెడ్యూల్ వివరాలను వెల్లడించింది. జీహెచ్‌ఎంసీలోని 150 డివిజన్లలో ఇద్దరు కార్పొరేటర్లు చనిపోగా..మరో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. 146 మంది కార్పొరేటర్లు 15 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ నెల 10 నుంచి 17 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఆదివారం (16వ తేదీ మినహా) మిగిలిన రోజుల్లో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఔత్సాహికులు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు. 18న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ, ఆదే రోజు బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటనను అధికారులు విడుదల చేయనున్నారు. ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్, కౌంటింగ్ మూడు గంటల తర్వాత ఉండనుందని పేర్కొన్నారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతున్నదని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులకు బీఆర్ఎస్ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఈ సారి ఎన్నికల ఏడాది కావడంతో ఎన్నికలు జరుగుతాయా? ఏకగ్రీవం అవుతుందా? అనేది ఉత్కంఠగా మారింది.

# స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధం

### 34 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారని ప్రచారం



మేడ్చల్, ఫిబ్రవరి4(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజగిరి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధం ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్న ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది. దీంతో జిల్లాలో ఎన్నికల నిర్వహణపై ప్రజలు అయోమయానికి గురువుతున్నారు. గతంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామాలు 5 మండలాలు ఉండేవి. 61 గ్రామాల నుంచి ఇటీవలే గత ఏడాది సెప్టెంబర్‌లో 28 గ్రామాలను సమీపంలో ఉన్న మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం జిల్లా 34 గ్రామాలకే పరిమితమైంది. మిగిలిన గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని గత వారం రోజుల కిందట జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా, దీనికి మద్దతుగా జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పెద్దలను కలిసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కోరుతున్నట్లు తెలుస్తున్నది. మిగిలిన గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తుండగా, తప్పనిసరిగా అ గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమవుతాయని కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు అనుమానంగానే కనపడుతున్నాయి.

#### 28 గ్రామాల ఓటర్ జాబితా రద్దు..

మున్సిపాలిటీల్లో విలీనమైన 28 గ్రామాల ఓటర్ జాబితా రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో విలీనమైన గ్రామాలు మున్సిపాలిటీ ఓటర్ జాబితాలో త్వరలోనే చేర్చనున్నారు. విలీనమైన గ్రామాలకు గత నెల 4న రాష్ట్ర గెజిట్‌లో ప్రకటించిన నేపథ్యంలో విలీన గ్రామాల ఓటర్ జాబితాను రద్దు చేశారు. మిగిలిన 34 గ్రామాలకు సంబంధించి 65,748 ఓటర్లు ఉన్నట్లు జాబితాను తయారు చేసి.. ఎన్నికల సంఘానికి నివేదికను జిల్లా అధికారులు ఇచ్చారు. జిల్లాలో మూడు మండలాలైన మేడ్చల్, శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 34 గ్రామాలకు సంబంధించి జనాభాతో పాటు ఓటర్ల జాబితాను సిద్ధం చేసి నివేదించారు.

#### మరిన్ని మండలాలు కలుపుతారా?

ప్రస్తుతం 3 మండలాలకే పరిమితమైన జిల్లాలో మరికొన్ని మండలాలు కలిపి జడ్పీని కొనసాగించేలా ప్రభుత్వం చూస్తున్నట్లు మరో ప్రచారం వినిపిస్తున్నది. ప్రస్తుతం ఉన్న మూడు మండలాల్లో మరో 3 మండలాలను అదనంగా చేసి 6 మండలాలను చేసి గ్రామాల సంఖ్యను పెంచేలా చూస్తున్నట్లు సమాచారం. అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలను త్వరలోనే జీహెచ్‌ఎంసీ పరిధిలో విలీనం చేసే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మండలాల పెంపు, మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీ విలీనం, ఉన్న 34 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారని జరుగుతున్న ప్రచారాలతో జిల్లా ప్రజలు అయోమయానికి గురువుతున్నారని చెప్పవచ్చు.

# వీఆర్‌ఏల ముట్టడి ఉద్రిక్తం

### మినిస్టర్స్ క్వార్టర్స్ వద్ద మంత్రుల నివాసాలను ముట్టడించిన వీఆర్‌ఏలు
### లోపలికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు, ఇరువర్గాల మధ్య తోపులాట
### మహిళలపై పోలీసుల జులుం..
### వీఆర్‌ఏలపై దాడిని ఖండించిన బిఆర్ఎస్..

సిటీబ్యూరో/బంజారాహిల్స్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 61 ఏండ్లు నిండిన వీఆర్‌ఏల వారసులను విధుల్లోకి తీసుకుని ఉద్యోగాలు కల్పించాలని ఇచ్చిన జీవోలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏ జేఏసీ మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ వద్దకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వీఆర్‌ఏలు, వారి కుటుంబసభ్యులు తరలివచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని మంత్రుల నివాసాలను ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వీఆర్‌ఏలను మినిస్టర్స్ క్వార్టర్స్ దగ్గర వరకు వెళ్లనివ్వకపోవడంతో వారు రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. 3797 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి వందలాది మంది వీఆర్‌ఏలు ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మోహరించిన బంజారాహిల్స్ పోలీసులు వారిని అడ్డుకున్నా పట్టించుకోకుండా వందలాది మంది వీఆర్‌ఏలు మంత్రుల క్వార్టర్స్ వద్దకు చేరుకొని లోనికి ప్రవేశించేందుకు యత్నించారు.వారిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

#### మహిళను ఈడ్చేసిన పోలీసులు

ఇదిలా ఉండగా మంత్రుల నివాసాల ముట్టడికి యత్నించిన వీఆర్‌ఏల ఆందోళనలో పాల్గొన్న వారిలో 98 మందిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మరోవైపు మినిస్టర్ క్వార్టర్స్ వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల నివాసాల ముట్టడికి తరలివచ్చిన వీఆర్‌ఏలపై తమ బలం చూపించారు. మంత్రుల నివాసాల్లోకి వారిని వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈక్రమంలోనే మహిళలని చూడకుండా ఈడ్చేశారు. అంతే కాదు తన ప్రాణం బాగాలేదని, హార్ట్ ప్రాబ్లమ్ ఉందని, కాళ్లు మొక్కుతా.. వదిలేయండంటూ పోలీసుల కాళ్లా వేళ్లాపడ్డా కూడా వారు కనికరించలేదు. తనను లాగొద్దంటూ ఆ మహిళా వీఆర్‌ఏ ఎంత మొత్తుకున్నా పోలీసులు ఆమెను ఈడ్చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వీఆర్‌ఏలు, వారి కుటుంబసభ్యులపై పోలీసుల జులుం విమర్శలకు దారితీసింది.

#### పట్టించుకోవడం లేదు

**- వీఆర్‌ఏ జేఏసీ కో కన్వీనర్ వంగూరు రాములు**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఏలకు పే స్కేల్‌తో పాటు వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 81, జీవో 85లను విడుదల చేసింది. వారిలో 16,758 మందికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారు. అయితే 3797 మంది వీఆర్‌ఏల వారసులకు సంబంధించిన ఉద్యోగాలు పెండింగ్‌లో పెట్టారు. 15 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వీఆర్‌ఏల ఉద్యోగాల విషయంలో నాన్చివేత ధోరణితో వేలాది కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వీఆర్‌ఏలు ఆందోళన చేసిన సమయంలో తమది న్యాయమైన డిమాండ్ అని మద్దతు పలికిన కాంగ్రెస్ నేతలు,అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రి అయినప్పటికీ తమ న్యాయమైన కోరికలను ఇప్పటికీ తీర్చలేదు సరికదా.. అసలు పట్టించుకోవడం లేదు.

#### ఇదేనా ఇందిరమ్మ పాలనా..

**- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి**

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా మంత్రులకు విన్నవించడానికి వచ్చిన వీఆర్‌ఏలపై ప్రభుత్వ అనుసరించిన వైఖరి, పోలీస్ జులుంను తీవ్రంగా ఖండిస్తున్నాం. బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి అండగా ఉండి ప్రభుత్వం మెడలు వంచైనా వారి డిమాండ్లను పరిష్కరించే దిశగా కృషి చేస్తాం. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం.. ఇదేనా ప్రజాపాలన.. ప్రజాపాలన అంటూ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నిత్యం ప్రజాసమస్యలు వింటామని, నిలబడ్డ చోటే పరిష్కారం చేస్తామని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పీడితులు, బాధితులు తమ బాధలు చెప్పుకోవడానికి వస్తే ఇలా చొరబాటుదారులు, సంఘవిద్రోహులు, తీవ్రవాదులను అణచివేసినట్లు దాడులు చేస్తున్నారు.





వీఆర్‌ఏలపై పోలీసుల జులుం